నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప / అన్నమయ్య
21 మంగళవారం, మే 2024 పేజీలు: 08

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**అధికారులతో సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు**



కడప కలెక్టరేట్, మేజర్‌న్యూస్ : ఎన్నికల కోడ్ అమలుకు ముందు ఆమోదం పొంది.. పెండింగ్ లో ఉన్న అన్ని రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు సోమవారం కడప జిల్లా పరిషత్ సభాభవన్ లో జేసీ గణేష్ కుమార్, నగర కమీషనర్ జి ఎస్ ఎస్ ప్రవీణ్ చంద్, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, డిఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి.. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలుకు ముందే ఆమోదం పొంది పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతి, రెవెన్యూ సర్వీసులు, లీగల్ అంశాలు, సచివాలయాల సేవలు, సిబ్బంది హాజరు ప్రభుత్వ భవన నిర్మాణాలు, అర్జీల పరిష్కారం వేగవంతం వంటి అంశాలపై.. సిహెచ్ఓలు, ఎంహెచ్ఓ లతో సమీక్షించారు. మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు నేరుగా సమీక్షించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు, పెండింగ్ లోఉన్న అభివృద్ధి పనులపై అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పూర్తి పని చేయాలన్నారు. ఆయా మండలాలు,



# జిల్లా కేంద్రం వెళ్లాలంటే తడిసి మోపెడు..!



అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్: ఇప్పటికే జిల్లా కేంద్రం కోల్పోయి, అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటికి రావాలంటే అష్ట కష్టాలు పడుతున్న రాజంపేట రైల్వే కోడూరు వాసులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రాయచోటి జిల్లా కేంద్రం కాబట్టి రాజంపేట రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి చాలామంది ప్రజలు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసుకునేందుకో, లేక ఎస్పీకి ఫిర్యాదు చేసుకునేందుకు తరచుగా కలెక్టరేట్కు వస్తూ ఉంటారు. అయితే రాజంపేట నుంచి రాయచోటికి బస్సులు ఉన్న అవి వేరే మార్గంలో నేరుగా బస్టాండ్ కి వెళ్లడం, అక్కడినుండి ప్రజలు కలెక్టరేట్కు రావాలంటే తిరిగి 40 నుంచి 50 రూపాయలు ఖర్చు అవుతుండడంతో సామాన్యులకు తలకి మించిన భారం అవుతుంది. ముఖ్యంగా రాజంపేట నుంచి వచ్చే బస్సులు కలెక్టరేట్ వైపు నుండి నడిపితే చాలామంది ప్రజలకు ఉపయోగముంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆర్టిసి అధికారులు కూడా గుర్తించి ఆ దిశగా బస్సు నడపడం వలన ప్రయోజనం ఉంటుందని, ప్రజల సౌకర్యార్థంతోపాటు ఆదా కూడా అవుతుందని పలువురు తెలియజేస్తున్నారు. రాజంపేట నుండి రాయచోటికి 70 రూపాయలు ఛార్జి అయితే, రాయచోటి బస్టాండ్ నుండి కలెక్టరేట్కు 40 నుంచి 50 రూపాయలు వసూలు చేస్తుండడంతో కలెక్టరేటుకు వచ్చే సామాన్యులకు తడిసి మోపెడవుతుంది. ఇప్పటికే కడప నుంచి వచ్చే బస్సులకు కలెక్టరేట్ వద్ద స్టాపింగ్ ఉండడం తో అటువైపుగా వచ్చే ప్రయాణికులకు సౌకర్య మంచిగా ఉన్న, రాజంపేట నుంచి వచ్చే ప్రయాణికులకు కలెక్టరేట్ వైపు బస్సులు వచ్చే అవకాశం ఉన్న అధికారులు నేరుగా బస్టాండ్ వైపు మరో దారిలో తీసుకువెళుతుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మరి ప్రతినిత్యం కలెక్టరేట్ పనుల మీదుగా బస్సుల్లో వచ్చే సామాన్యుల పరిస్థితి ఏంటో కొంచెం అర్థం చేసుకొని ఆర్టీసీ అధికారులు కూడా కలెక్టరేట్ వైపుగా బస్సులు నడిపితే ప్రజలకు ఉపయోగపడుతుందని, ఆ దిశగా ఆలోచించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే అనేక మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఆర్టీసీ అధికారులకు మెమోరాండం అందించేందుకు కూడా జిల్లా స్థాయి అధికారులతో పాటు, నాయకులు కూడా చొరవ తీసుకొని ఆ దిశగా అధికారులు ఆదేశాలు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని, ప్రజలకు భారమవుతున్న ఈ ప్రయాణాన్ని కలెక్టరేట్ వైపుగా నడిపిస్తే కొంతలో కొంత ప్రజలకు ఉపశమనం లభిస్తుందని పలువురు తెలియజేస్తున్నారు. మరి నాయకులు అధికారులు చొరవ తీసుకొని రాజంపేట రైల్వే కోడూరు ప్రజలకు సౌకర్యవంతంగా బస్సుల రూట్ లను మార్చాలని పలువురు కోరుతున్నారు.

**జిల్లా కేంద్రం వెళ్లాలంటే తడిసి మోపెడు?**

**రాజంపేట నుండి కలెక్టరేట్ మీదుగా బస్సులు ఎందుకు నడపరు?**

**రాజంపేట ప్రజల కష్టాలు పట్టించుకోరా?**

**కలెక్టరేట్ వైపుగా బస్సులు నడిపితే ప్రజలకు ఆదా..**

**పట్టణంలో దిగి కలెక్టరేట్ వెళ్లాలంటే జేబుకు చిల్లు**

**ఆర్టీసీ అధికారులు ఆలోచించాలంటూ రాజంపేట వాసులు**

# పెనగలూరులో వైకాపాకు గత వైభవం నిలిచినా?



**భారీగా మెజార్టీ తగ్గొచ్చు అంటున్న పోలింగ్ సరళి**

**కూటమికి మద్దతిచ్చిన పలువురు నాయకులు**

**భారీగా క్రాస్ ఓటింగ్ జరిగిన ఆనవాళ్లు**

**వైకాపా విజయం పై ప్రభావం చూపునున్న పెనగలూరు**



పెనగలూరు, మేజర్‌న్యూస్ : రైల్వే కోడూరు నియోజకవర్గంలో వైసీపీకి కంచుకోటగా, వైసీపీ విజయంలో కీలక పాత్ర పోషిస్తున్న పెనగలూరు మండలంలో ఈసారి వైసీపీకి అనుకూలంగా పోలింగ్ జరిగిందా లేదా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఈనెల 13వ తేదీ జరిగిన పోలింగ్లో పెనగలూరు మండలంలో వైసీపీకి దీటుగా కూటమి అభ్యర్థికి కూడా భారీగా ఓట్లు పోలయ్యాయని, ప్రతి ఎన్నికల్లో రైల్వే కోడూరు ఎమ్మెల్యేని నిర్ణయించే పెనగలూరు మండలం ఈసారి మాత్రం వైసిపికి అంత అనుకూలంగా ఉండకపోవచ్చు అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా రైల్వే కోడూరు నియోజకవర్గంలో అన్ని మండలాల కంటే పెనగలూరు మండలంలోని వైసీపీకి ప్రతి ఎన్నికల్లోను భారీ మెజార్టీ వచ్చేది. అయితే ఏకపక్ష నిర్ణయాలు, స్థానిక నాయకుల్లో అసంతృప్తి, కార్యకర్తల్లో అసంతృప్తి వెరసి చాలామంది వైసిపి నాయకులు కార్యకర్తలు కూటమునకు వైపు మొగ్గు చూపారు. కొందరు తెలుగుదేశం జనసేన కండువా కప్పుకొని ప్రత్యక్షంగానే కూటమికి మద్దతుగా నిలిచారు. అయితే మరికొందరు మాత్రం పార్టీ మారకపోయినా జనసేనకి జై కొట్టి , తమతో ఉన్న కార్యకర్తలను, ప్రజలను కూటమికి మద్దతు ఇవ్వాలని పోలింగ్ కు ముందు ఆదేశాలు జారీ చేయడంతో సైలెంట్ ఓటింగ్ కూటమి వైపు మొగ్గుచూపిందని, అందుకే ఈసారి గత ఎన్నికల్లో వచ్చిన మాదిరిగా వైకాపాకి పెనగలూరు మండలంలో మెజారిటీ రాదని, వైసిపి జనసేనకు సమాన ఓట్లు గాని, లేకపోతే స్వల్ప మెజార్టీ వస్తుంది కానీ రైల్వే కోడూరులో వైసీపీని గెలుపు తీరాలకు చేర్చే మెజార్టీ మాత్రం సాధ్యం కాదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**కొంపముంచిన క్రాస్ ఓటింగ్**

పెనగలూరు మండలంలో క్రాస్ ఓటింగ్ వైకాపా కొంపముంచునున్నదని పోలింగ్ సరలి చూస్తే అర్థమవుతుంది. ఎమ్మెల్యే అభ్యర్థికి చాలామంది జనసేన వైపు మొగ్గు చూపుతూ, ఎంపీ అభ్యర్థికి వైకాపాకు ఓటు వేశారని, అలాగే కొందరు వైకాపా నాయకులు కూడా మీ ఇష్టం వచ్చినట్లు ఓట్లు వేసుకోండి అని క్రింది స్థాయి కార్యకర్తలకు చెప్పడంతో వారు కూడా క్రాస్ ఓటింగ్ పాల్పడినట్లు పలువురు తెలియజేస్తున్నారు. ఇరు పార్టీలు సమాన స్థాయిలో నోట్ల పంపిణీ చేయడం, చాలామంది ఇద్దరికీ సమన్యాయం చేయాలని ఒక ఓటు ఒక పార్టీకి, మరో ఓటు మరో పార్టీకి వేయడంతో ఈ క్రాస్ ఓటింగ్ ఎవరి కొంప మంచ నుందో అర్థం కాక మండల పరిధిలోని నాయకులతో పాటు ప్రజలు కూడా తలలు పట్టుకుంటున్నారు. మొత్తానికి ఈసారి మాత్రం పెనగలూరు మండలంలో జరిగిన విచిత్ర రాజకీయం ఏమిటో జూన్ 4న అర్థమవబోతుంది.

# కౌంటింగ్‌కు మూడు అంచల భద్రత

**కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలి**

**కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి యం.అభిషిక్త్ కిషోర్**



రాయచోటి, మేజర్ న్యూస్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు మూడంచెల భద్రత, ప్రణాళిక బద్ధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్ లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్ కు సంబంధించి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సాఫీగా విజయవంతంగా ముగిసిందని ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు తెలియచేశారు.

# జాతరను శాంతియుతంగా జరుపుకోవాలి

## శాంతి కమిటీ సమావేశంలో సిఐ పార్థసారథి



చెన్నూరు మేజర్ న్యూస్ : చెన్నూరులో ఆదివారం జరగునున్న ఎల్లమ్మ జాతర ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని చెన్నూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పార్థసారథి కోరారు. చెన్నూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో సోమవారం సాయంత్రం చెన్నూరులోని అన్ని మతాల గ్రామ పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎల్లమ్మ జాతర సందర్భంగా ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఉండేందుకు అందరూ సహకరించాలని జాతరలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత శాంతి కమిటీ సభ్యులపై ఉందన్నారు. జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారికి సూచించారు. జాతరను పర్యవేక్షించడానికి ఉన్నతాధికారులతో పాటు పోలీసులు బందోబస్తుగా ఉంటారని తెలిపారు. ఎల్లమ్మ దేవాలయం వద్ద కూడా అమ్మవారిని భక్తులు దర్శించేందుకు ఇబ్బందులు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మత సామరస్యానికి చెన్నూరు పెట్టింది పేరని కాబట్టి అందరూ సోదర భావంతో మెలిగి జాతర ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ, అన్ని పార్టీల, మతాల నాయకులు, శాంతి కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దు : ఎస్ఐ



కలసపాడు మేజర్ న్యూస్ : పెట్రోల్ బంకు నిర్వాహకులు బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని ఈసీ ఆదేశించినట్లు కలసపాడు ఎస్సై నాగమురళి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం ఎస్సై మాట్లా డుతూ.. కలసపాడు పరిధిలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహ నాల్లో మాత్రమే ఇంధనం నింపాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఎస్ఐ నాగమురళి హెచ్చ రించారు.

# 21 నుంచి 25 వరకు నిత్య కళ్యాణమూర్తు బ్రహ్మోత్సవములు



కమలాపురం మేజర్ న్యూస్ కమలాపురం మండలం శ్రీ రామాపురం మహాపుణ్యక్షేత్రంలో ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. శ్రీ మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీవల్లి దేవసేన దివికంధర షణ్ముఖ సుబ్రమణ్య స్వామి, సంజీవిని సహిత వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవములు కనులు పండగ నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు సాయినాథ శర్మ సోమవారం ప్రకటన పేర్కొన్నారు.

# ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు

## ప్రజలకు అందని సేవలు... ఎక్కడా కనిపించని అధికారులు






రామాపురం, మేజర్ న్యూస్ మండలంలోని పలు సచివాలయాల్లో ఉద్యోగులు లేకుండా ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయి. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్మించుకున్న సచివాలయల్లో ఆ యొక్క ఉద్యోగులు మధ్యాహ్నం ఒంటిగంటకే సచివాలయంలో లేకుండా వెళ్ళిపోతున్న ఘటన మండలంలోని పలు సచివాలయాల్లో చోటు చేసుకుంటున్నాయి. మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకే పాలన అని ప్రతి గ్రామంలో కొన్ని కోట్లు ఖర్చుపెట్టి సచివాలయాలు ఏర్పాటు చేసి మండల కార్యాలయం చుట్టూ తిరగకుండా గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ సర్వీసులు అందించాలని, గ్రామ సచివాలయ సిస్టం ఏర్పాటు చేయగా దానికి విరుద్ధంగా సచివాలయ సిబ్బంది తూతూ మంత్రంగా కార్యాలకు వచ్చి మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి వెళ్లిపోవడంతో, ఆయా సచివాలయ ప్రజలు పనుల కోసం సచివాలయాలకు వెళ్లి వెనక్కి తిరిగి పోవాల్సి వస్తుంది. ఇదేమిటని పలువురు సచివాలయాలకు వెళ్లి అడగగా ఎన్నికల డ్యూటీలు అని సాకు చెప్పడంతో ఏమి చేసేదిలేక వెనుతిరిగి పోతున్నారు. ఇదే విషయమై ఎంపీడీవో ని వివరణ కోరితే మేము ఎన్నికల డ్యూటీ పరంగా పలు దూరాల నుంచి ఇక్కడికి వచ్చాం, మీ రెగ్యులర్ ఎంపీడీవో ని సంప్రదించి చర్యలు తీసుకోవాలని సమాధానం చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామ సచివాలయాల్లో సమయపాలన పాటించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలని పలువురు కోరుకుంటున్నారు.

# అతి శుభ్రతా ప్రమాదమే..!





ఒసిడి ఉన్న వ్యక్తులకు ముందస్తు మరణాలు సంభవిస్తున్నాయని, కొత్త అధ్యయనం వెల్లడించింది. స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇనిస్టిట్యూట్‌లోని పరిశోధకులు ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒసిడి వలన అకాల మరణాలు సంభవించే అవకాశం 82 శాతం ఎక్కువగా ఉందని వెల్లడించింది నివేదిక. ఈ పరిశోధనలు మరింత నిశితంగా, త్వరితంగా జరగవలసిన ఆవశ్యకత ఉందని నొక్కి చెబుతున్నారు నిపుణులు.

ఒసిడి (అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్) అంటే ఒక మానసిక రుగ్మత. బాధితుడికి అసమంజసమైన ఆలోచనలు, భయాలు ఉంటాయి. ఈ ఆలోచనలు రోజువారీ జీవన కార్యకలాపాలకు ఆటంకంగా ఉంటాయి. ఒసిడి ఉన్న వ్యక్తులకు ఉండే లక్షణాలను చూస్తే.

అతిశుభ్రత, వ్యవస్థీకృతంగా అంటే అందరూ తుచ తప్పకుండా నియమ నిబంధనలతో ఉండాలనే అభిప్రాయాలను వ్యక్తపరచటం

ప్రతి వస్తువును నిర్ణీత ప్రదేశంలో ఉంచడం గురించి నిరంతరం విపరీతంగా ప్రవర్తించడం

స్టవ్ తీసేశానా లేదా అని, తాళము వేశానా లేదా అని ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయడం

ఎక్కువసార్లు స్నానం చేయడం, పదేపదే చేతులు కడుక్కోవడం

నిరంతరం తననెవరో గమనిస్తున్నట్లు, తనకు ఇబ్బంది కలిగిస్తారని భావించి.. వారిపట్ల దురుసుగా ప్రవర్తించడం

కొన్ని మూఢ నమ్మకాలను గాఢంగా నమ్ముతారు. ఒక్కోసారి వారు నమ్మే విషయాన్ని రుజువు చేయడానికి విపరీతంగా రియాక్ట్ అవుతారు. అందుకోసం తనకు తాను హాని కలిగించుకోవడానికిగానీ, ఇతరులకు హాని చేయడానికిగానీ వెనుకాడరు.

కొన్ని సందర్భాల్లో రోగికి తన పరిస్థితి గురించి తెలుస్తుంది. అలాంటప్పుడు తన ప్రవర్తనలను సానుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తాడు. ఒక్కోసారి అది వేరేవిధంగా దారితీసే అవకాశం ఉంది. తన పరిసర వాతావరణాన్ని ప్రశాంతంగా, అనుకూలంగా ఏర్పరచుకోగలిగితే పరిస్థితి బాగానే ఉంటుంది. అలా కాని పక్షంలో ఆత్మహత్యలకు పాల్పడేందుకు సిద్ధపడే ప్రమాదం ఉంది. ఒసిడిపై పరిశోధనలు పుష్కలంగానే జరుగుతున్నప్పటికీ ఇవే కారణాలని చెప్పడానికి సరైన సమాచారం లేదంటున్నారు నిపుణులు. నిర్బంధ కట్టుబాట్లు, మూఢ విశ్వాసాల అనుచిత ఆలోచనలు కొంతవరకు కారణమంటున్నారు.

ఎప్పుడూ వ్యతిరేక ఆలోచనలు చేయడం, ఇతరులతో దూకుడుగా ప్రవర్తించడం, చేసిన పనినే పదేపదే చేయడం, ఇతరులూ అలానే ఉండాలనడం ఈ లక్షణాలతో సంబంధ బాంధవ్యాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తుంటారు. ఇలాంటప్పుడు సామాజికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

అంతేకాదు. ఒసిడి వలన కొన్ని ఇతర అనారోగ్య కారణాలు సంభవించి మరణానికి దారితీస్తున్నాయి. ఊపిరితిత్తుల వ్యాధులు (73 శాతం), మానసిక లోపాలు (58 శాతం), మూత్రపిండ, పునరుత్పత్తి అవయవాల వ్యాధులు (55 శాతం), ఎండోక్రైన్, జీవక్రియకు సంబంధించిన వ్యాధులు (47 శాతం), రక్త నాళాలు (33 శాతం), నాడీ వ్యవస్థ (21 శాతం), జీర్ణ వ్యవస్థ (20 శాతం) (2.5 శాతం) రక్తప్రసరణ వ్యవస్థలలోనూ వ్యాధులు సంభవిస్తున్నాయని అధ్యయనాల్లో తేలింది. ఈ వ్యాధుల తీవ్రత కారణంగా సహజ మరణాలు సంభవిస్తే.. దీనికి ఐదు రెట్లు (అనుమానాలు, ఆందోళన, నిరాశ, వ్యతిరేక ఆలోచనల వలన) ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తేలింది. అంతేకాక ఈ వ్యక్తులు రోడ్డు ప్రమాదాలకు గురికావడం.. లేదా ఎక్కడైనా తెలియకుండా పడిపోవడం వలన కూడా మరణాలు సంభవిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

నాలుగు దశాబ్దాలుగా సాగిన పరిశోధనలో ఒసిడితో బాధపడుతున్న కొంతమంది వ్యక్తులను మామూలు వ్యక్తులతో పోల్చి పరిశోధనలు చేశారు. మనిషి సగటు ఆయుర్దాయానికీ, వీరి జీవిత కాలానికీ గుర్తించిన వ్యత్యాసం ఆందోళన కలిగిస్తోంది. దాదాపు పది సంవత్సరాల ముందే మరణానికి గురవుతున్నారు. ఇవి జన్యుపరమైనవి మాత్రమే అనడానికీ లేదు. పరిసరాలు, ఆర్థిక ప్రమాణాలు, సామాజిక, పర్యావరణ కారకాలు ఇలా అనేకమైనవి ఒసిడికి కారకాలుగా విశదమవుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రాత్రి పూట నిద్ర పట్టడం లేదా? ఇది ఫాలో అవండి



మనిషికి నిద్ర చాలా అవసరం. ప్రతి రోజు కనీసం 7 గంటలపాటు పడుకోవాలి. నిద్ర లేమితో చాలా మంది బాధపడుతూ ఉంటారు. వారు ఈ టిప్స్ ఫాలో అవండి. చేపలు, చెర్రీలు వంటి ఆహార పదార్థాలు బాగా తీసుకోవాలి. తరచూ వ్యాయామం, ధ్యానం చేయాలి. రాత్రి పూట ఎక్కువగా సెల్ ఫోన్లు చూడరాదు. కాఫీ, టీ, మద్యం, ధూమపానం తగ్గించాలి. మనసును ప్రశాంతంగా ఉంచే విధంగా మీ పడక గదిని తయారు చేసుకోవాలి.

# కార్డెన్ సర్చ్ లో సారాతో పట్టుబడ్డ మహిళ అరెస్ట్



మదనపల్లె క్రైమ్, మేజర్‌న్యూస్ :మదనపల్లె నక్కలదిన్ని తండాలో పోలీసులు కార్డెన్ సర్చ్ చేపట్టి మహిళను అరెస్టు చేశారు. సీఐ వల్లి బాష కథనం మేరకు.. జిల్లా ఎస్పీ కృష్ణరావు, డిఎస్పీ ప్రసాదరెడ్డి ఉత్తర్వులతో సోమవారం స్థానిక నక్కలదిన్నె తాండాలో కార్డెన్ సర్చ్ చేపట్టామన్నారు. అనుమానిత ప్రదేశాలు, ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా బుక్కే రాములమ్మ (29) ఇంటి వద్ద సారా అమ్ముతూ పట్టుబడగా,15 లీటర్లసార సీజ్ చేసి, కేసు నమోదు అనంతరం అరెస్టు చేశామన్నారు

## కారు ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు



మదనపల్లె క్రైమ్, మేజర్‌న్యూస్ : మదనపల్లెలో కారు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొండామారేపల్లి పంచాయతీ సత్యసాయి కాలనీకి చెందిన భవన కార్మికుడు శ్రీనివాసులు(30) బైకుపై ఇంటికి బయలుదేరాడు. సీటీఎం రోడ్డులోని ఎస్టేట్ వద్ద కారు వేగంగా వచ్చి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులను చికిత్స కోసం స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

## భర్తపై కోపంతో భార్య ఆత్మహత్యాయత్నం



మదనపల్లె క్రైమ్, మేజర్‌న్యూస్ : మదనపల్లెలో ఓ మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించింది. తాలూకా పోలీసుల వివరాల మేరకు.. బసినికొండకు చెందిన నౌషాద్ తన భార్య షమీంను కుటుంబ సమస్యల విషయమై మందలించాడు. దీంతో ఆమె అవమానంగా భావించి మనస్తాపంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. కుటుంబీకులు గమనించి ఆమెను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి చికిత్స అందించారు. ఘటనపై తాలూక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



మదనపల్లె క్రైమ్, మేజర్‌న్యూస్ : కురబల కోట మండలం, అంగళ్లు విశ్వం కళాశాల వద్ద సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. మదనపల్లెకు చెందిన నవీన్, ప్రియాంక, మన్విత బైకుపై బయలుదేరారు. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టారు. కారు డ్రైవర్ కిరణ్‌తో సహా బైకుపై ఉన్న నవీన్, ప్రియాంక, మన్విత తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో డాక్టర్ల సలహా మేరకు వారిని తిరుపతికి తరలించారు. ఘటనపై ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జూనియర్ ఇంటర్మీడియట్ నందు ప్రవేశానికి దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్మీడియట్‌లో (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశ పరిక్ష వ్రాసిన బాలురు, బాలికలకు, ఈ నెల 22, 23వ తేదీల్లో గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ జరుపబడుతాయని జిల్లా సమన్వయ అధికారి ఎల్ మాధవిలత తెలిపారు. విద్యార్థులు ఈ నెల 22న కడప జిల్లా పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలో జూనియర్ ఇంటర్మీడియట్ లో ప్రవేశ పరిక్ష వ్రాసిన బాలురకు గండిక్షేత్రం గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ జరుగును. బాలికలకు చిన్నచౌక్ గురుకుల పాఠశాలలో ఈనెల 23న కౌన్సిలింగ్ నిర్వహించన్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఎల్ ,మాధవిలత తెలిపారు. బీఆర్ఏజి ఇంటర్ సెట్ 2024 లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుంది అని పేర్కొన్నారు. బాలుర గురుకులలో 284 ఖాళీలు, భాలికల గురుకులలో 441 ఖాళీ ల భర్తీకి 1:3 నిష్పత్తిలో కౌన్సిలింగ్ నిర్వసిస్తునట్లు తెలిపారు. 22, 23 తెదిల్లో ఉదయం 9:00 గంటలకు కౌన్సిలింగ్ ప్రారంబం అవుతుందన్నారు. మెరిట్ కార్డు, పరీక్ష హాల్ టికెట్, ర్యాంక్ కార్డ్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పదవ తరగతి మార్క్స్ మేమో మరియు స్టడీ సర్టిఫికేట్ ఆధార్ వెంట తీసుకురావాలని సూచించారు. మొత్తం725 సీట్లు ఖాళీలు ఉన్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఎల్ మాధవిలత గారు వివరించారు.

## రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిపివేత




రాజంపేట, మేజర్‌న్యూస్ బ్యూరో :అన్నమయ్య డ్యాంలోని ఫిల్టర్ల ద్వారా రాజంపేట పట్టణానికి సరఫరా అయ్యే మంచి నీటికి మంగళ, బుధవారాల్లో రెండురోజుల పాటు అంతరాయం కలగనుంది. మండలంలోని బోయినపల్లె వై జంక్షన్ వద్ద 400 ఎంఎం మెయిన్ పైపులైన్ లీకేజీ అవుతున్న కారణంగా మరమ్మత్తు పనులు చేపట్టాల్సి ఉన్నందున రెండు రోజులు పట్టణానికి నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని వారు కోరారు.

## భారీ వర్షాలతో చెన్నూరు వద్ద పెన్నా నదికి జలకల



చెన్నూరు, మేజర్‌న్యూస్ : పెన్నా నది, కుందు నది, ఎగువ ప్రాంతంలోని నంద్యాల జిల్లా, కడప జిల్లాలో పలు ప్రాంతాల్లో మోస్తారు భారీ వర్షాలు కురవడంతో కుందు నది నుంచి పెన్నా నదిలోకి వర్షపు నీరు చేరుతున్నది. పెన్నా నది ఎగువ ప్రాంతంలో ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో పెన్నా నదిలోకి వర్షం నీరు పరుగులు పెడుతున్నాది. సోమవారం వల్లూరు మండలం అది నిమ్మయపల్లి వద్ద నిర్మించిన ఆనకట్ట వద్ద నీటి కల సంచరించుకుంది.

## మొదలైన వేసవి విజ్ఞాన శిబిరాలు



యర్రగుంట్ల మేజర్‌న్యూస్ : నగరంలోని యర్రగుంట్ల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంధాలయ అధికారి జయరాములు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 25 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వారికి కథలు బోధిస్తూ కథలోని నీతి వాక్యాలను క్షుణ్ణంగా వివరిస్తూ పలు రకాల సూచనలు సలహాలు ఇచ్చారు. కథల వల్ల ఎక్కడ ఎలా ప్రవర్తించాలో, మనకు తెలియని విషయ విశేషాలతో పాటు, జీవితంలో ఎత్తుకు ఎదగడానికి ఎంతో ఉపయోగపడతాయి అన్నారు.

## పాము కాటేసి రైతుకు అస్వస్థత



మదనపల్లె క్రైమ్ మేజర్‌న్యూస్ : ములకల చెరువు మండలంలో రైతును పాము కాటేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకుల వివరాల మేరకు.. చౌడసముద్రం పంచాయతీ కొత్తపల్లెకు చెందిన రైతు గంగిరెడ్డి గారి నాగార్జున(45) ఊరికి సమీపంలో ఉన్న తన వ్యవసాయ బోరు బావి వద్ద పొలం పనులకు వెళ్లాడు. అక్కడ పాము కాలిపై కాటేసింది. వెంటనే కుటుంబీకులు బాధితుడిని చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. దీంతో రైతు ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

## పెద్దమ్మ తల్లి ని దర్శించుకున్న వైసిపి అభ్యర్థి రాచమల్లు



ప్రొద్దుటూరు మేజర్‌న్యూస్: సోమవారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ప్రముఖ దేవాలయం పెద్దమ్మ తల్లిని వైసిపి అభ్యర్థి ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి సకుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

## ఎల్లమ్మ తల్లి జాతర ప్రశాంతతకు అందరూ సహకరించాలి



కమలాపురం, మేజర్‌న్యూస్ : ఈనెల 26వ తేదీ ఆదివారం జరుగుతున్న ఎల్లమ్మ తల్లి జాతర ప్రశాంతతకు అందరూ సహకరించాలని సీఐ పార్థసారథి కోరారు. సోమవారం సాయంత్రం ఆయన చెన్నూరు పోలీస్ స్టేషన్ ఆవరణంలో చెన్నూరు గ్రామంలోని ఇరువర్గాల గ్రామ పెద్దలు శాంతి కమిటీ సభ్యులుతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎల్లమ్మ జాతర సందర్భంగా ఊరేగింపులో ఎటువంటి గొడవలు అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూడాల్సిన బాధ్యత శాంతి కమిటీ సభ్యులపై ఉందన్నారు.

## మేయర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ

కడప సిటి, మేజర్‌న్యూస్ : కడప మేయర్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు సురేష్ బాబును, ఆయన కుటుంబ సభ్యులను సోమవారం కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాశ్ రెడ్డి పరామర్శించారు. మేయర్ సోదరుడు కుమారుడు ఆనంద్ నిన్న హఠాన్మరణం చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యాన్ని నింపారు. ఆనంద్ మృతి తీరని లోటని, ఆయన మృతి పట్ల సానుభూతి తెలిపి, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

మొదటి పేజీ తరువాయి



మున్సిపాలిటీల పరిధిలో గృహ నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. ప్రతి గురు వారం... మండల స్థాయి అధికారులతో క్రమం తప్పకుండా ప్రత్యేక సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా రోగ్య భద్రత గురించి మాట్లా డుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారి శుద్ధ్యంపై ఎంపిడివోలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడా కూడా తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మీ–సేవా, ఏపీ సేవా పోర్టల్ లో ప్రతిరోజు విధిగా సర్వీసు రిక్వెస్టుల ను పరిశీలించి సంబంధిత రిపోర్టులు, పరిష్కార నివేదికలను నమోదు చేయాలన్నారు. పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు అసౌకర్యం లేకుండా తరగతి గదుల మరమ్మతులు, నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం నదీ తీరాల్లో ఎక్కడా కూడా ఇసుక సరఫరా చేయడానికి వీలు లేదన్నారు.అన్ని మండలాలకు టెలి కమ్యూనికేషన్ సెట్స్ జిల్లా వ్యాప్తంగా అధికారులకు కమ్యూ నికేషన్ నెట్ వర్క్ మెరుగ్గా నిర్వహించడానికి మొత్తం 23 వేర్వేరు ఛానెళ్ల ద్వారా రెవెన్యూ సర్వీసులపై సమీక్షించుకు నేందుకుకు కమ్యూనికేషన్ సెట్స్ అందివ్వడం జరుగుతుందన్నారు. ఆర్డిఓలతో పాటు ప్రతి మండలానికి ఎంపిడివోలు, తహశీల్దార్లకు, సీఎస్ఓలు, ఎంఎస్ఓ లకు ఇంజనీరింగ్, హౌసింగ్ అధికారులకు వెంటనే సమాచారాన్ని చేరవేయ డం, సమీక్షించడంతో పాటు.. అత్యవసర సమయాల్లో, విపత్తుల సమయంలో తక్షణ సమాచార సేకరణ కోసం... టెలి సెట్స్ ఎంతో ఉపయోగపడను న్నాయన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని రెవెన్యూ డివిజన్ల.. ఆర్డీవోలతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, హౌసింగ్, డ్వామా, డిఆర్డీఏ, పీఆర్ అధికారులు, ఇంజనీర్లు తదితరులు హాజరయ్యారు.



# కౌంటింగ్‌కు మూడు అంచల భద్రత

మొదటి పేజీ తరువాయి

అలాగే జూన్ 4న నిర్వహించే ఎన్నికల ఓట్ల లెక్కింపు నిమిత్తం అన్ని విధాల సంసిద్ధంగా ఉండాలని, ఇందుకోసం ముందు గానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ తో కౌంటింగ్ ప్రక్రియను మొదలు పెట్టాలని, అలాగే 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ కౌంటింగ్ ప్రక్రియపై జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా అన్ని ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులో నిబంధనల మేరకు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసుకోవాలని కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడింగ్, ఆర్ఓ టేబుల్, కౌంటింగ్ స్టాఫ్ టేబుల్స్, ఏజెంట్ల సీటింగ్, లైట్లు, ఫ్యాన్లు, కంప్యూటర్ సిస్టమ్స్, ఇంటర్నెట్ తదితర అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. అబ్జర్వర్ల లాంజ్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా బ్యారీ కేడింగ్ ఉండాలని, అలాగే కౌంటింగ్ కేంద్రంలో మరియు స్ట్రాంగ్ రూము నుంచి ఈవీఎంలను కౌంటింగ్ హాలుకు తీసుకొచ్చే దారిలో బ్యారికేడింగ్ తో పాటు సీసీ కెమెరాలు ఉండాలని, కౌంటింగ్ హాలు లోకి ప్రవేశించేందుకు అధికారులకు మరియు ఏజెంట్లకు విడిగా బ్యారికేడింగ్ ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో నిర్దేశిత ప్రాంతంలో మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయా నియోజకవర్గాల రౌండ్ వారి ఫలితాల ప్రకటనలను మీడియా కేంద్రానికి వెనువెంటనే పంపాలని ఆర్వో లకు సూచించారు. కౌంటింగ్ కేంద్రానికి అవసరమైన లైటింగ్ ఏర్పాటుతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, ఇందుకు తగ్గిన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఆహారం, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల అందరికీ తగిన శిక్షణ ఇవ్వాలని ఇందుకు షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజు ఎక్కడ కూడా కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపు ప్రక్రియ ఆగరాదన్నారు.వర్షం సూచన ఉన్నందున కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్య నారాయణ రావు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు

# పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు..


## ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వెల్లడి



ప్రొద్దుటూరు మేజర్‌న్యూస్: జూన్ నెల 4 న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ప్రొద్దుటూరు నియోజకవర్గ కౌంటింగ్ కు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్త్ ఏర్పాట్లపై స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో సోమవారం పోలీస్ అధికారులతో సూక్ష్మ స్థాయిలో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి కౌంటింగ్ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ఎక్కడెక్కడ, ఎవరు, ఎలా విధులు నిర్వహించాలో ఆదేశాలిచ్చారు. కౌంటింగ్ నేపథ్యంలో జూన్ నెల 1 నుండి 6 వరకూ ఎలాంటి ఊరేగింపులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఎస్.పి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే రాజకీయ నేతల గృహ నిర్బంధాలు, జిల్లా బహిష్కరణ అమలు చేయడం జరుగు తుందని ఎస్.పి వివరించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారిపై కూడా నాన్ బెయిలబుల్ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగు తుందని జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. సమా వేశంలో ప్రొద్దుటూరు డి.ఎస్.పి మురళీధర్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ జి.రాజు, ప్రొద్దుటూరు వన్ టౌన్ సి.ఐ శ్రీకాం త్, టూ టౌన్ సి.ఐ అబ్దుల్ కరీం, త్రీ టౌన్ సి.ఐ వెంకటర మణ, రూరల్ సి.ఐ రమణారెడ్డి, ఎస్.ఐలు, పాల్గొన్నారు.


# గెలుపు ధీమాలో ఇరు పార్టీల నాయకులు

## అట్లూరులో మెజారిటీపై జోరుగా బెట్టింగ్‌లు



అట్లూరు, మేజర్ న్యూస్: రాష్ట్రంలో మే 13 వ తేదీన సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందోనని అట్లూరు మండలంలోని ప్రజలలో అలాగే ఇరు పార్టీలోని నాయకులు కార్యకర్తలు కేడర్ లలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది అధికార పార్టీ నాయకులు కేడర్ మొత్తం జగన్ చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి ప్రజలు కచ్చితంగా వైసీపీని భారీ మెజా ర్టీతో గెలిపిస్తారని జగనన్నకు తోడుగా నిలుస్తారని ఎన్నికల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు మరోవైపు ఎన్డీఏ కూట మి నాయకులలో జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసారని ఒక నియంతల వ్యవహరించా డని రాష్ట్రంలోని ప్రజలు అందరూ కూడా చంద్రబాబును ముఖ్యమంత్రిగా అవ్వాలని కోరుకుంటున్నారని మండలం లో కూడా ఈసారి ఎన్డీయే కూటమి ఎక్కువ మెజారిటీ సాధిస్తుందని గెలుపు వార్ వన్ సైడ్ గా ఉంటుందని ఎన్డీఏ తీసుకువచ్చిన మేనిఫెస్టో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుందని కూటమి నాయకులు జూన్ 9న రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోయేది నారా చంద్రబాబు నాయుడు అని గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నారు అట్లూరు మండలంలో ఉన్న 12 పంచాయితీలలో ఈసారి జరిగిన ఎలక్షన్లలో ఎక్కువ పర్సంటేజ్ పోలింగ్ నమోదు కావడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది గత ఎలక్షన్ లతో పోల్చుకుంటే ఈసారి అన్ని పంచాయతీలలో ఓటర్లు ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం జరిగింది ఇందులో మహిళా ఓటర్లు ఎక్కువగా పాల్గొన్నారు వీరు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతారోనని ఇరు పార్టీలోని నాయకులు కార్యకర్తలలో టెన్షన్ మొదలైంది కొన్ని గ్రామాలలో ఒకవైపు అట్లూరు మండలం లో ఏ పార్టీ అత్యధిక ఓట్లను సాధిస్తుందొనని మెజారిటీ పై కొంతమంది బెట్టింగ్ వేస్తుండటం, అలాగే ఆయా గ్రామాలలో పార్టీల మెజారిటీ పైన కూడా భారీ మొత్తంలో బెట్టింగ్ వేస్తుండటంతో మండలం లోని ప్రజలు ఎన్నికల ఫలితాలపై ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలు ఫుల్ జోష్ లో ఉన్నారు మండలం లో మెజార్టీ మాదంటే మాదే అంటూ ఇరు పార్టీలు పోటీ పడుతుండటంతో మండలంలోని ప్రజలు మునుపెన్నడూ లేని విధంగా ఎన్నికల ఫలితాల కోసం ఉత్కంఠ గా ఎదురుచూస్తున్నారు

# పులివెందులలో బసవ జయంతి



పులివెందుల మేజర్‌న్యూస్ : పులివెందుల పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ గురు జంగమ్మ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భీమలింగస్వామి బసవేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్ల బండి పై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కలశాలు పట్టుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. గ్రామోత్సవం వెంబడి కోలాటం ప్రత్యేకంగా ఆకట్టుకున్నది.

## 22న మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన నరసాపురంలోని మండల పరిషత్ సభ భవనం నందు ఈ నెల 22వ తేదీన శ్రీ అవధూత కాశినాయన మండలం సర్వసభ్య సాధరణ సమావేశము నిర్వహిస్తున్నట్లు ఎం.పీ.డీ.ఓ.పి. మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో రెవిన్యూశాఖ, వ్యవసాయ శాఖ, ప్రాదమిక ఆరోగ్య శాఖ, సాంఘికసంక్షేమ శాఖ, వసతి గృహము శాఖల పనితీరుపై, త్రాగునీటి సమస్య, మంచినీటి సౌకర్యము కల్పించుట గురించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకము పనితీరుపై, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పనితీరుపై, మండలంలోని స్వయం సహాయక సంఘాల పని తీరుపై రోడ్లు, భవనముల శాఖ వారి పనితీరు పై, పంచాయతి శాఖ వారి పనితీరు పై, చర్చించడం జరుగుతున్నారు. ఈ కార్యక్రమానికి మండలం లోని ఎం.పీ.టీ.సీ.లు, అన్ని గ్రామాల సర్పంచ్లు అన్ని శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు

### డిఎస్పి ఎండి షరీఫ్



కడప క్రైం మేజర్ న్యూస్ : జూన్ నెల 6 వ తేదీ వరకూ కడప అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎలాంటి ఊరే గింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప డి.ఎస్.పి ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. సోమవారం డి.ఎస్.పి పత్రికా ప్రకటన విడుదల చేశారు. జూన్ 6 అనంతరం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసిన తర్వాత పరిశీలించి ర్యాలీలకు, ఊరేగింపులు అనుమతిస్తామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురికి మించి గుమికూడదన్నారు. 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉందని కడప డి.ఎస్.పి ఎం.డి షరీఫ్ తెలిపారు. కడప నగరంలో అన్ని రకాల దుకాణాలు రాత్రి 9 గంటల కే మూసివేయాలని డి.ఎస్.పి తెలిపారు. ట్రబుల్ మాంగర్లు జాగ్రత్తగా ఉండాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని కడప డి.ఎస్.పి ఎం.డి షరీఫ్ హెచ్చరించారు.

**స్ట్రాంగ్ రూమ్ల వద్ద నో డ్రోన్ ఫ్లై జోన్**

నగరంలోని మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీ లో ని స్ట్రాంగ్ రూమ్ లలో ఈవీఎం లను భద్రపరిచిన నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో 'డ్రోన్ నో ఫ్లై జోన్ ' గా ప్రకటిస్తున్నట్లు కడప డి.ఎస్పీ ఎం.డి షరీఫ్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డి.ఎస్పీ షరీఫ్ హెచ్చరించారు.

## విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించండి



కాశి నాయన మేజర్ న్యూస్ : విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే నాణ్యమైన విద్యను అందిస్తామని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్,తెలుగు పండిట్ మహేష్ కుమార్ తెలిపారు సోమవారం వారు మండలంలోని రెడ్డి కొట్టాల,చెన్నవరం గ్రామాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి కొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్నత విద్యార్హతలుకలిగిన ఉపాధ్యాయు లు ఉన్నారని తెలిపారు.ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తా మన్నారు. విద్యార్థులకు కావలసిన అన్ని సదుపాయాలు ప్రభుత్వపాఠశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కత్తెర గండ్ల గ్రామపంచాయతీ సెక్రటరీ హరిబాబు, సిబ్బంది వెంకటేష్ పెద్దయ్యలను కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా తల్లిదండ్రులకు సూచించాలని దాదా పీర్ మహేష్ కుమార్ కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజకీయం ఘనం... అభివృద్ధి శూన్యం...

- ఈసారైనా పుల్లంపేట అభివృద్ధి చెందేనా?
- బస్టాండు లేదు పార్కింగ్ లేదు
- అసలు మండల కేంద్రం అనవాల్లే లేవు
- రోజురోజుకి దిగజారుతున్న ప్రతిష్ట

పుల్లంపేట, మేజర్ న్యూస్ పేరు గొప్ప ఊరు దిబ్బ అనే సామెతకు అచ్చు గుద్దేలా సరిపోతుంది మండల కేంద్రమైన పుల్లంపేట. రైల్వే కోడలు నియోజవర్గంలో రాజకీయంగా ఘన చరిత్ర ఉన్న అభివృద్ధి లో మాత్రం శూన్యం కనిపిస్తుంది. రైల్వే కోడూరు నియోజకవర్గంలో అన్ని మండల కేంద్రాలు అభివృద్ధి పథంలో నడుస్తుంటే, మరి పుల్లంపేట మండలం మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలుస్తుంది. దీనికి కారణం ఏమో తెలియదు కానీ పుల్లంపేట మండల కేంద్రంపై, మండలంపై నాయకులకు చిన్న చూపు ఉందనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది.




అన్ని మండల కేంద్రాలలోనూ అన్ని వసతులు ఉన్న ఇక్కడ కనీసం ప్రయాణికులు కూర్చునేందుకు కూడా ఊరిలో గాని, బైపాస్ లో కానీ బస్టాండ్లు గాని బస్ షెల్టర్లు గాని లేకపోవడం చూస్తుంటే మండల కేంద్ర పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అలాగే అన్ని మండల కేంద్రాలలో విశాలమైన రోడ్లు ఉంటే ఇక్కడ మాత్రం ఒక వాహనం పోతే మరొక వాహనం కదిలేందుకు కూడా కష్టమైన పరిస్థితి. రైల్వే కోడూరు రాజకీయ ముఖ చిత్రంలో నాయకుల గెలుపు ఓటములను నిర్ధారించే మండలం గా పుల్లంపేటకు పేరు ఉన్న, బలమైన నాయకులు ఈ మండలంలో ఉన్న అభివృద్ధి మాత్రం అంతే బలంగా జరిగే అవకాశాలు ఇప్పటివరకైతే కనిపించలేదు. ఇక రైల్వే స్టేషన్ పరిస్థితి చెబితే ప్రజలు కూడా నవ్వుకునే పరిస్థితి. మరి నాయకుల వైఫల్యమో లేక ప్రజల దురదృష్టమో తెలియదు కాని ఒక మండల కేంద్రానికి ఉండాల్సిన అన్ని అర్హతలు, పుల్లంపేటకు ఉన్న, మండల కేంద్రానికి ఉన్న సౌకర్యాలు మాత్రం ఇక్కడ మచ్చుకైనా కనిపించవు. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కానీ, జూనియర్ కాలేజ్ గాని, ఉన్నత పాఠశాలలో కానీ ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ కనిపించవు. అయినా ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన వారికి మాత్రం ఇవేమీ కనిపించవు. అనేక సంవత్సరాలుగా పుల్లంపేటలో ఇదే తంతు నడుస్తున్న పార్టీలు అధికారాలు మార్చుకుంటున్నాయి కానీ ఇక్కడ పుల్లంపేట మండలం కేంద్రంలో మాత్రం ప్రజల సౌకర్యాలు మార్చడం లేదు. ఒకప్పుడు చేనేతలకు ప్రసిద్ధిగా అందరి నోటా వినపడే పుల్లంపేట ప్రస్తుతం ఇది మండల కేంద్రమా లేక మారుమూల గ్రామము అనేలా పరిస్థితి తయారయింది. మరి జూన్ 4లో వచ్చే ఫలితాలలో అయినా గెలుపొందే పార్టీ నాయకులైన మండల కేంద్రాన్ని గుర్తించి ఇక్కడ ప్రజలకు కావలసిన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తారో లేక ప్రజల వసతుల కంటే తమకు స్వప్రయోజనాలే ముఖ్యమంత్రి గతంలో లాగే వ్యవహరిస్తారో వేచి చూడాలి.

## పాలతో ఇలా చేస్తే...

వయసు పెరిగే కొద్దీ పలు కారణాల వల్ల జుట్టు తగ్గిపోతోందని ఆందోళన చెందనివారు ఉండరు. జుట్టు పోషణ కోసం, సంరక్షణ కోసం చాలామంది ఎంతో ఖర్చు పెడుతూ ఉంటారు. జుట్టును సహజంగా బలోపేతం చేయగల పదార్థాల్లో పాలు ముఖ్యమైనవి.

ఆరోగ్యానికి పాలు మంచి పోషకాహారం అని మనకు తెలుసు. అంతేకాదు, పాలలో ఉండే కేసీన్ అనే ప్రోటీన్ వల్ల జుట్టు ఒత్తుగా, బలంగా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. జుట్టు పోషణలో పాలను ప్రధాన భాగంగా చేసు కోవడం వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

పాలు జుట్టు కుదుళ్లకు బలాన్నిస్తాయి. జుట్టులో తేమను పెంచుతాయి. జుట్టును మెత్తగా, మృదువుగా మార్చుతాయి.

ఎక్కువ సేపు ఎండలో తిరగాల్సివచ్చినపుడు... సూర్యకాంతిలో ఉండే అతి నీల లోహిత కిరణాల వల్ల జుట్టు పొడిబారిపోయి, బిరుసుగా తయారవు తుంది. ఇలాంటి సందర్భాల్లో పాలను ఆహారంగానే కాకుండా జుట్టును శుభ్ర పరచడానికి కూడా వాడవచ్చు.

పాల మీగడ జుట్టు పొడిబారడాన్ని, బిరుసుదనాన్ని తగ్గించి... వెంట్రుకల



చివర్లు చిట్లిపోవడాన్ని నిరోధిస్తుంది. పాలలోఉండే విటమిన్ సి, పలు యాంటీ ఆక్సిడెంట్లు... కొల్లాజెన్ ఉత్పత్తికి తోడ్పడతాయి.

జుట్టు ఒత్తిడికి గురై, బలహీనమై, పొడిబారి, తెగిపోతూఉన్నప్పుడు, పాలు ఆ సమస్యను తగ్గిస్తాయి.

# కాలేయ ఆరోగ్యానికి ముల్లంగి మంచిదేనా?



కాలేయ ఆరోగ్యానికి ముల్లంగి తింటే మంచిదా? కాదా అని చాలామంది సందేహిస్తుంటారు. కొంతమంది అసలు ఈ ముల్లంగిని తినడానికే ఇష్టపడరు. మరి ముల్లంగిని మిస్కాకుండా తింటే.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి అని వైద్యులు చెబుతున్నారు.

కాలేయ ఆరోగ్యానికి ముల్లంగి ఎంతో సహాయపడుతుంది. ముల్లంగిలో ఉండే గ్లూకోసినోలేట్స్ వంటి సమ్మేళనాలు కాలేయ ప్రక్రియలలో సహాయపడతాయి.

ముల్లంగిలో యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. అలాగే విటమిన్ సి కూడా ఎక్కువగా ఉంటుంది. ముల్లంగి సూప్ లేదా జ్యూస్ని తాగితే.. కాలేయ కణాలను రక్షించడంలో సహాయపడుతుంది. కాలేయ కణాల పునరుత్పత్తిని పెంచుతుంది.

ముల్లంగిలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాలేయ ఆరోగ్యానికి బరువు చాలా కీలకం. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి ముల్లంగి ఎంతగానో సహాయపడుతుంది. ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకుంటే కాలేయ ఆరోగ్యం మెరుగుతపడుతుంది.

రక్త ప్రవాహంలో టాక్సిన్స్ వడపోత ప్రక్రియలో ముల్లంగి సహాయపడు తుంది.

ముల్లంగిలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ వంటి పోషకాలను అందిస్తుంది. ఇవి కాలేయ ఆరోగ్యానికి పరోక్షంగా తోడ్పాటునందిస్తాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు.

## ఆదరణ వృద్ధాశ్రమంలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



కడప కల్చరల్, మేజర్‌న్యూస్: కడప జూనియర్ ఎన్‌టిఆర్ ఫాన్స్ అధ్వ ర్యంలో ఎన్‌టిఆర్ 41వ పుట్టిన రోజు వేడుకలను ఆదరణ నిరాశ్రయుల వృద్ధా శ్రమంలో కేక్ కట్ చేసి అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ నాయ కులు మాట్లాడుతూ వృద్దులు, ఆనాధలు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఉన్నఆదరణ షెల్టర్‌లో జూనియర్ ఎన్‌టిఆర్ 41వ పుట్టిన రోజు జరుపు కోవటం ఫాన్స్‌కు ఎంతో సంతోషంగా వుందని తెలిపారు. తమ హీరోకు కూడా ఇలాంటి అనాథల మధ్య పుట్టిన రోజు జరుపుకోవటం ఎంతో ఇష్టమని తెలిపారు. ఆయన తమ ఫాన్స్ కూడా ఇలాంటి సేవ చేయాలనీ చెపుతుంటా రని గుర్తు చేశారు. ఆదరణ షెల్టర్‌లో ఉన్న పెద్దలందరూ జూనియర్ ఎన్ టి ఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షెల్టర్ నిర్వాహకులు, బ్యాక్ వర్డ్ కమ్యూనిటీ లిటరసీ డెవలప్మెంట్ సొసైటీ (బిసిఎల్‌డిఎస్) అధ్య క్షులు విజయ్‌బాబు ఫాన్స్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పంజం జన్మదిన వేడుకలు



రైల్వే కోడూరు మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక పట్టణం లోని డాల్ఫిన్ డెల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖులు వైసీపీ కార్యకర్తలు భారీ ఎత్తున పూల మాలలతోను శాలవలతోనూ సుకుమార్ రెడ్డిని ముంచెత్తారు. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ అభిమానులు కార్యకర్తలు తనపై చూపిస్తున్న అభిమానం మరువ రానిదని వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆయన అన్నారు. భవిష్యత్తులో అందరి కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజాసే వకే అంకితమై పనిచేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ, చంద్ర, రంగారెడ్డి, షఫీ, డబ్బి సిద్దయ్య, శివయ్య తో పాటు అనంతరాజుపేట, తంబిళ్ళవారిపల్లి ప్రాంతాలకు చెందిన పంజం అభిమానులు భారీ ఎత్తున పాల్గొని కేకు కట్ చేసి పంచిపెట్టారు.

## ఘనంగా జూ.ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు

### అనాధవృద్ధులకు అన్నదానం



వేంపల్లె, మేజర్‌న్యూస్: సినీనటి ప్రముఖుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ మనవడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని మధర్ థెరిస్సా అనాధ వృద్ధాశ్రమంలో వృధ్ధులకు ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పఠాన్ దస్తగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనాధ వృధ్ధులకు అన్నదానం, పండ్లు-స్వీట్లు పంపిణీ చేశారు. తమ అభిమాన నాయకుడు నందమూరి తారక రామారావు 41వ పుట్టిన రోజు వేడుకలను అనాధవృధ్ధుల మధ్య నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అభిమా నులు తెలిపారు. పాలెం భరత్, కుట్టి, బాబా, గౌస్ తదితర అభిమానులు పాల్గొన్నారు.

## జూనియర్ ఎన్‌టిఆర్ డై హార్డ్ ఫాన్స్‌చే ఆదరణలో అల్పాహారం



కడప ఏడురోడ్లు, మేజర్ న్యూస్: రామారావు యాదవ్ జిల్లా ప్రెసిడెంట్, జూనియర్ ఎన్.టి.ఆర్ డై హార్డ్ ఫాన్స్ అద్వర్యం లో ఆదరణ లో అల్పాహారం. జూనియర్ ఎన్.టి.ఆర్. 41 వ పుట్టిన రోజు సందర్భంగా ఎన్.టి.ఆర్ డై హార్డ్ ఫాన్స్ తమ వంతుగా ఆదరణలో అల్పాహారం అందచేస్తున్నామని, పెద్దలు అందరు ఎన్.టి.ఆర్‌ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షెల్టర్ నిర్వాహకులు, బ్యాక్ వర్డ్ కమ్యూనిటీ లిటరసీ డెవల ప్మెంట్ సొసైటీ అధ్యక్షులు విజయ బాబు జూనియర్ ఎన్.టి.ఆర్.ఫాన్స్ అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్



మదనపల్లి మేజర్ న్యూస్ : అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అమ్మచెరువు మిట్ట వద్ద వెలుగు ప్రత్యేక పాఠశాల వెనుక వైపున జరుగుతున్న బ్లాస్టింగ్ పనులను కాలనీ వాసులతో కలసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్రమ బ్లాస్టింగ్ ఆపాలి, బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి, కబ్జాదారులకు అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఐటియుసి నాయకుడు జి.కృష్ణమూర్తి లు మాట్లాడుతూ మదనపల్లి మండలం కోళ్లబైలు రెవెన్యూ గ్రామంలో భూ కబ్జాలకు అక్రమాలకు అంతే లేకుండా పోయిందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల మధ్యలో అర్ధరాత్రి పూట సర్వేనెంబర్ 529 లో ఉన్న గుట్టలో బ్లాస్టింగ్లు చేయడం వలన భూమి కంపించి ఇల్లు కదులుతున్నాయని వివరించారు. వెలుగు స్కూల్ లో ఉన్న మానసిక వికలాంగులు వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కబ్జాదారులకు అధికారుల వత్తాసు పలకడం వలనే అక్రమ బ్లాస్టింగ్ లు జరుగుతున్నాయని అన్నారు. జిల్లా కలెక్టర్ గారు ఆర్డీవో గారు స్పందించి అక్రమ బ్లాస్టింగ్ ఆపాలని లేనిపక్షంలో ప్రజలందరినీ కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ నగర్, బృందావన్ కాలనీ, జగన్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

### - పెద్దఎత్తున రక్తదానం,అన్నదానం



మదనపల్లె,మేజర్ న్యూస్ : అద్భుత నటనతో అభిమానుల్లో ప్రత్యేక గుర్తిం పు సంపాదించుకుని,తెలుగు సినీ పరిశ్రమలో వర్ధమాన హీరోల్లో ఒకరుగా గుర్తింపు పొందిన యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ (నందమూరి తారక రామారావు) జన్మదిన వేడుకలను సోమవారం సేవా కార్యక్రమాలతో మదనపల్లె జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ (టెంపర్ రాజేష్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టడంతోపాటు అభిమాన కథా నాయకుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం స్థానిక టౌన్ బ్యాంకు సమీపంలో గల మదనపల్లి వాలంటరీ బ్లడ్ బ్యాంకు నందు రక్తదాన శిబిరం ఏర్పాటు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు స్వచ్ఛందంగా పెద్దఎత్తున రక్తదానం చేశారు.అదేవిధంగా బసినికొండ నందు గల కూరపర్తి సాయి చైతన్య స్రవంతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నందు విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ రాజేష్ మాట్లాడుతూ తెలుగు చలన చిత్రరంగంలో విలక్షణ నటనతో అభిమానుల హృదయాలను కొల్లగొట్టిన కదా నాయకుడు జూనియర్ ఎన్టీఆర్ అన్నారు.ఇటు నటన,అటు సేవా కార్యక్రమాలతో కోట్లాదిమంది ప్రజలు అభిమానాన్ని ఎన్టీఆర్ సొంతం చేసుకున్నారని కొనియాడారు.తాము సైతం అభిమాన కథానాయకుడిని ఆదర్శంగా తీసుకుని అయన అడుగు జాడ ల్లో సేవా కార్యక్రమాలకు ముందుంటామని చెప్పారు.బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసి యేషన్ మదనపల్లి అధ్యక్షులు యర్రబల్లి వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ తమ అభిమాన కదా నాయకుడి పుట్టినరోజుకు ప్రతి ఏటా అనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు.ఇందులో భాగంగా సుమారు 50 మంది ముం దుకొచ్చి రక్త దానం,విద్యార్థులకు అన్నదానం చేయడం పట్ల వారి సేవాభా వాలకు నిదర్శనమన్నారు.భవిష్యత్తులో మరింత ఆదర్శవంతంగా సేవా కార్యక్ర మాలతో ముందుకు సాగాలని కోరుతూ జూనియర్ ఎన్టీఆర్ కు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. నాయి బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రాణాపాయ పరిస్థితుల్లో అత్యవసరమైన వారికి రక్తదా నం చేయడంలో ఎప్పటికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ముందుంటార న్నారు. ఆయన సేవాస్ఫూర్తిని యువత అనుసరించడం శుభపరిణామని పేర్కొ న్నారు. కాగా రెండు కాళ్లు లేని చాంద్ బాషా అనే దివ్యాంగుడు ప్రతిసారి రక్త దానం చేస్తూ యువతకు ఆదర్శంగా నిలచాడు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్య క్షులు ప్రభాకర్,ఉపాధ్యక్షులు రవి ఆర్ఎస్,టెంపర్ గణేష్,కార్యదర్శి రెడ్డిరాజా (టెంపర్ రెడ్డి), షేక్ మహబూబ్, చాంద్ బాషా,శబరి, నవీన్,శ్రీనాథ్, శ్రీని వాసులు,వేణు గోపాల్, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## అల్లర్లు సృష్టిస్తే నాన్ బెయలబుల్ కేసులు

### ఎస్.ఐ చంద్రమోహన్



వీరబల్లి మేజర్‌న్యూస్ : మం డలంలో ఎన్నికల తర్వాత మన రాష్ట్రంలో జరుగు తున్న పోస్ట్ పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని ఎవరైనా, ఎంతటి వారైనా గొడ వల ను ప్రోత్సహించిన, అల్లర్లు సృష్టించి న గొడవల్లో పాల్గొన్న వారిపై హత్యా యత్నం లాంటి నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రిమాండ్కి తర లించి జైలుకు పంపడం జరుగు తుందని వీరబల్లి ఎస్.ఐ చంద్రమో హన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ఎవరైనా అల్లర్ల కు పాల్పడితే వారిపై రౌడీ షీట్స్ కూడా ఓపెన్ చేసి, మండల మరియు జిల్లా బహిష్కరణ చేయడం కూడా జరుగు తుందన్నారు. గతంలో రాజకీయ కక్షలకు పోయి భవిష్యత్తును నాశ నం చేసుకున్న వారు ఎందరో ఉన్నారని అలాంటి కోవలో వెళ్లకుండా కక్ష సాధింపులు లేకుండా గ్రామాలలో అన్నదమ్ములవలె కలిసి మెలిసి పోవాలని అలాకాకుండా రెచ్చగొట్టే ప్రయత్నం చేసి గొడవలకు కారణమైతే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరబల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలలో నిగువుంచడం జరుగుతుంద న్నారు. ప్రజలు, రాజకీయ నాయకులు దయచేసి ఎవరూ కూడా గొడవలు పెట్టుకోవద్దుని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. గ్రామాలలో ఏదైనా సమస్యలు వుంటే పోలీస్ స్టేషన్ కు వచ్చి తమను సంప్రదిస్తే పోలీస్ శాఖ తరుపున వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

## ఆశాలకు ఎన్నికల అలవెన్సులు వెంటనే మంజూరు చేయాలి

- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్



మదనపల్లె, మేజర్‌న్యూస్ : 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఎన్నికల అలవెన్సును తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక మదనపల్లి ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రతి ఆశా కార్యకర్తకు రూ.500 చెల్లించాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఇప్పటి వరకు అలవెన్సులు అందజేయకపోవడం బాధాకరమని చెప్పారు.గతంలో పది,ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించిన వారికి కూడా అలవెన్సు ఇవ్వలేదన్నారు.కరోనా కాలంలో కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి చొప్పున ఆరు నెలలకు రూ.6 వేలు విడుదల చేసినా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదని వాపోయారు.అధికారులు వెంటనే స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, రెడ్డప్ప, మురళి, భావాజాన్, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం



బద్వేలు మేజర్‌న్యూస్: జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని, ఆయన అభిమానులు సోమవారం పట్టణంలోని మైదుకూరు రోడ్ అలాగే దివ్యజ్యోతి అనాధ్రశమం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు మాట్లాడుతు తమ అభిమాన కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ఇమేజ్ కు తగ్గట్లుగా రానున్న కాలంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో మనోజ్, దిలీప్,చైతన్య, నరసయ్య, రవి, నాగేంద్ర, మహేష్, రఫీ, కాత్రాజ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికాసానికి సోపానాలు విజ్ఞాన శిబిరాలు



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్ పౌరగ్రంథాలయశాఖ ఆదేశాల మేరకు స్థానిక పట్టణ పరిధిలో బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హై స్కూల్ నందు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం 19 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థుల మానసిక వికాసానికి సోపానాలుగా నిలుస్తాయని పేరొన్నారు. విద్యార్థులకు పురాణాల నుండి మహావిష్ణువు అవతారాలయిన దశావతారాల గురించి వివరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాయలసీమ జూనియర్ కాలేజి గ్రంధాల అధికారి యన్. గంగాధరరెడ్డి జిరాఫీ చేస్ కథను, పాటను విద్యార్థుల చేత వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, హైస్కూలు సిబ్బంది రెహ్మాన్ ఖాన్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ వేరుశనగ కాయల పంపిణీకి సర్వసిద్ధం

### సబ్సిడీతో జనుము,జీలుగ విత్తనాలు పంపిణీ
### మండల వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్



మదనపల్లె, మేజర్ న్యూస్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఐదు మడకలతో లోతు దుక్కులు చేసుకొంటే బెట్ట పరిస్థితులను వేరుశెనగ పంట తట్టు కొంటుందని మదనపల్లి మండల మండల వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా వర్షాలు కురిసిన సమయంలో నీరు భూమిలోకి బాగా ఇంకి, తేమశాతం పెరుగుతుందని వివరించారు. త్వరలోనే సబ్సిడీ వేరుశనగ కాయలు కోసం రైతులు ఆర్బీకేలో వివరాలు నమోదు చేసుకోవాలని,ఇందు కోసం త్వరలోనే ప్రకటన విడుదల చేస్తామన్నారు.మదనపల్లి మండలంలో 2500 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉంటే గత ఏడాది 2 వేల హెక్టార్లలో సాగు జరిగిందని, ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరికొన్ని హెక్టార్లు తగ్గే అవకాశం ఉందన్నారు.మండలానికి కె6 రకం 1680 క్వింటాళ్ళు,లేపాక్షి రకం 73 క్వింటాళ్ల కేటాయింపులు జరిగాయని చెప్పారు.వచ్చిన స్టాక్ నిల్వ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు.అదేవిధంగా ఆర్బికెల ద్వారా జనుము,జీలుగా సబ్సిడీతో రైతులకు అందజేయడం జరుగుతుందని వెల్లడించారు.కె6 రకం వేరుశనగ కాయలు 40 శాతం సబ్సిడీతో కిలో 57 రూపాయలు ప్రకారం 30 కిలోలు 1710 రూపాయలు ప్రకారం రైతులకు పంపిణి చేయడం జరుగుతుందన్నారు.అలాగే లేపాక్షి రకం 30 కిలోల బస్తా రూ.1556 అందజేస్తామని చెప్పారు.

## వైవీయూ దూరవిద్య పీజీ ఫలితాలు విడుదల



కడప వైవీయూ, మేజర్‌న్యూస్: యోగి వేమన విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ తన ఛాంబర్ లో సీడీవోఈ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి.వెంకట సుబ్బయ్య తో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ( ఎన్ఈపీ)-2020 ఆధారంగా, చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీఎస్ఎస్)ని కలుపుకొని మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 21 నుండి 26 వ తేదీ వరకు నిర్వహించా మన్నారు. ఈ పరీక్షల ఫలితాల ను విశ్లేశిస్తే ఆర్థికశాస్త్రంలో 92.9 శాతం, ఇంగ్లీష్ లో 92.6 శాతం, చరిత్ర లో 100 శాతం, మాస్ కమ్యూనికేషన్ మరియు జర్నలిజంలో 87.5శాతం, రాజకీయ శాస్త్రంలో 94.5శాతం, మనస్తత్వశాస్త్రంలో 91.3 శాతం, ప్రత్యేక తెలుగు: 92.8 శాతం,వాణిజ్య శాస్త్రంలో 85.7శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. తొలిసారి ఉత్తమ ఫలితాలు సాధించిన అధ్యయన కేంద్రాల నిర్వాహకులను, విద్యార్థుల ను అభినందించారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఓఈ)ని ద్వారా ఆర్ట్స్, హ్యుమానిటీస్, కామర్స్‌లో వైవీయూ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ను అందిస్తోందన్నారు.పరీక్షలు ముగిసిన రెండు వారాల్లోనే ఫలితాలను ప్రచురించడంలో సీడీవోఈ బృందం వేగవంతమైన చర్యకు వీసీ ఆచార్య చింతా సుధాకర్ ప్రశంసించారు. పరీక్షలు , అనతికాలంలోనే ఫలితాలు, మాడ్యూల్ అభివృద్ధి చేయడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషించారంటూ సీడీవోఈ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణా రెడ్డి ఆయన బృందాన్ని అభినందించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఏకకాలంలో రెండు కోర్సులను అభ్యసించవచ్చన్నారు. ఒకటి ఫిజికల్ మోడ్‌లో మరొకటి ఆన్లైన్ విధానంలో చదవవచ్చన్నారు. ఇలా పొందిన డిగ్రీలు తదుపరి విద్య , ఉపాధి అవకాశాల కోసం సమాన విలువను కలిగి ఉంటాయని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ అలానే ఆన్‌లైన్ లెర్నింగ్ విధానం విద్యార్థుల కు ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీడీవోఈ డిప్యూటీ డైరెక్టర్లు. ఎం. శ్రీధర్ బాబు, సిబ్బంది, టి. చంద్ర శేఖర్ రెడ్డి, కె. రాజ శేఖర్, ఎస్జబీవుల్లా, జి. కనకరత్నమ్మ పాల్గొన్నారు.

## హట్టహాసంగా రిపోర్టర్ హరిప్రసాద్ జన్మదినవేడుకలు



రామసముద్రం మేజర్ న్యూస్: రామసముద్రం మండలంలో టి టి డి కల్యాణ మండపం లో పత్రిక విలేకరి హరిప్రసాద్ జన్మదినాన్ని ప్రజాప్రతినిధులు,తమ తోటి సహచర పత్రిక విలేకర్లు గజమాల వేసి శాలవతో సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.హరి ప్రసాద్ మాట్లాడుతూ నా జన్మదిన వేడుకలకు వచ్చిన ప్రజా ప్రతి నిధులకు నాసహచర పత్రిక విలేకరులకు అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ వేడుకల్లో జడ్పీటీసీ రామచంద్రారెడ్డి,వాల్మీకి అధ్యక్షులు దొడ్డి పల్లె ఆనంద,యువనాయకులు సచివాలయ కన్వీనర్ భాస్కర్, దర్శన్, హరినాథ్,రాఘవేంద్ర,ఉప సర్పంచ్ మస్తాన్,అమూల్ డైరీ సర్దార్ బాషా,సమీ,నారాయణ స్వామి, పవన్ ,ఇమ్రాన్,మండల దళిత సంఘం నాయకులు అంబరీష్,సుధాకర్ మెకానిక్ వెంకటేష్,పవన్, వాలెప్ప, కేశవ,బసప్ప, రెడ్డెప్ప చలపతి,కృష్ణప్ప,రవి,లక్ష్మి నారాయణతదితరులు పాల్గొన్నారు.

## క్రాకర్స్ అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు



బద్వేలు మేజర్‌న్యూస్: అనుమతులు లేకుండా పటాకులు అమ్మితే తగిన చర్యలు చేపడతామని అర్బన్ సీఐ యుగంధర్ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ యుగంధర్ సోమవారం పట్టణంలోని పలు దుకాణాలలో అర్బన్ ఎస్సై సత్య నారాయణతో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతులు లేకుండా పటాకులు విక్రయాలు జరిపితే అలాంటి వారిపై చట్టపరంగా తగిన చర్యలు చేపడతామన్నారు.ఈ తనిఖీలలో అర్బన్ పోలీసులు పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

### ప్రయాణికులకు, వాహనదారులకు మజ్జిగను పంపిణీ



ఖాజీపేట మేజర్‌న్యూస్: ఖాజీపేట మండలం కుమ్మర కొట్టలు గ్రామం నందు నందమూరి తారక రామారావు( జూనియర్ ఎన్టీఆర్) 41వ జన్మదిన వేడుకలను గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు10 కిలోల కేక్ కటింగ్ చేసి అభిమానులకు పంచి పెట్టారు . అదేవిధంగా జాతీయ రహదారి వెంట వెళ్ళ ప్రయాణికులకు వాహనదారులకు 200 లీటర్ల మజ్జిగను పంపిణీ చేయడంతో వారంతా ఎన్టీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మాట్లాడుతూ ఎన్టీఆర్ జన్మదిన పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అంతేకాకుండా భవిష్యత్తులో పెద్ద ఎత్తున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నాగిరెడ్డి విశ్వనాథ రెడ్డి, దారపునేని తరుణ్ నాయుడు, మదన్ మోహన్ నాయుడు, మహేష్, కల్లూరు మదన్ మోహన్ రెడ్డి, నాగులారపు పవన్ కళ్యాణ్, కిషోర్, ఉమేష్, కొండల్ రావు, హేమంత్, వేణుగోపాల్, సాయి కార్తీక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం.. చెన్నకేశవుని పరిణయం

## అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు





రాజుపాళెం,మేజర్‌న్యూస్: వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా లోక క్షేమం శాంతి కోసం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం ఆవరణంలోని శ్రీ సంజీవరాయ స్వామి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన పెండ్లి మండపంలో వధూవరులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక ఆసనంపై కూర్చోబెట్టారు. ముందుగా స్వామఅమ్మవార్లకు నూతనవస్త్రాలు సమర్పించి ఎదుర్కోలు, పూలదండలు మార్చుకోవడం వంటి కార్యక్రమాలను శోభయామ నంగా నిర్వహించారు.అనంతరం స్వామి అమ్మవార్లశిరస్సుపై

అర్చక స్వాములు జీలకర్ర బెల్లం ఉంచి వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ మాంగల్య ధారణనుకన్నుల పండుగగా నిర్వహించారు. కళ్యాణం అనం తరం మహిళా భక్తులు స్వామి అమ్మవార్లను కీర్తిస్తూ భజన సంకీర్తనలు చేశారు ఇక్కడికి వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందజేసి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో ఈ కళ్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బుక్కసముద్రం జగదీశ్వరరెడ్డి,కార్య నిర్వహణ అధికారి బి.వి నరసయ్య, ఎంపిటిసి సభ్యురాలు బుక్క సముద్రం ప్రవల్లిక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# కలసపాడు ఆర్టీసీ బస్టాండే డంపింగ్ యార్డ్

## ప్రయాణికులకు ప్రాణ సంఖటం - పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు - కాంట్రాక్టర్ వర్క్ల మీద ఉన్న ప్రేమ & పారిశుద్ధ మీద లేక పోయా..!.



కలసపాడు: మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక విధానాన్ని ఏర్పాటు చేసి గ్రామ వార్డు పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రణాళిక తో గ్రామ సీమల అభివృద్ధికి పాటు పడతా మ%శీ%టూ హామీలు ఇచ్చి నప్పటికి, ప్రధాన వీధులలో ఉన్న మురికి , చెత్త డంపింగ్ యార్డ్ లలో నిలువ చేసి గ్రామ,వార్డు స్థాయిలో నివసించే వారికి ఎలాంటి సమస్యలు లేకుండా చేయటమే తమ లక్ష్యం అంటూ చెప్పే సచివాలయ అధికారులు , సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ కాలయాపన చేస్తూన్న విషయం అందరికీ తెలిసిందే. గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్య సమస్యలు బాగోగు లపై దృష్టి నిలిపక పోవడం,పారిశుధ్య%శీ% పట్ల ఎలాంటి చర్యలు చేపట్టక పోవటంతో పారిశుధ్య పనుల లో మండల స్థాయి అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటు న్నప్పటికి మండల జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సింది కానీ క్రింది స్థాయి సిబ్బంది కి సూచనలు సలహాలు ఇవ్వడం లేదని ఆరోపణలు అధికంగా ఉన్నా యని,తెలుస్తుంది. కలసపాడు మండల కేంద్రము నందలి బస్టాండు లో ప్రతి నిత్యం ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు విద్యార్థులు ప్రజలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం ఏమిటో గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ప్రజలు,,ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు విద్యార్థులు,ప్రయాణికులు ఉమ్మడి కార్యాచరణ తో ఆందోనకు దిగనున్నట్లు వారు పేర్కొంటున్నారు.లక్షలాది రూపాయలను ఖర్చు చేసి గ్రామ పంచాయతీ వార్డుల వారీగా పరిశుభ్రత పాటించాలి అని హామి ఇచ్చే అధికారులకు కలసపాడు మండల కేంద్రంలో జరిగే నిర్లక్ష్యంపై ఎవరు బాధ్యులో వారిపై కఠిన చర్యలు తీసుకొని బస్టాండ్ పరిధిలో ఉన్నటువంటి ఈ మురికి వ్యర్థ పదార్థాలు దుర్వాసన వెదజల్లుతున్న వాటిని తొలగించి వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసరుకి అరుదైన పురస్కారం

## డాక్టర్ ఎస్.కుసుమకు జ్యేష్ఠ ఆచార్య అవార్డు ప్రధానం



కురబలకోట, మేజర్‌న్యూస్ : అంగళ్లులోని మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆండ్ సైన్స్ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి డాక్టర్ ఎస్. కుసుమ జ్యేష్ఠ ఆచార్య అవార్డును అందుకున్నట్లు కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. జాతీయ స్థాయిలో భారత్ ఎడ్యుకేషనల్ ఎక్స్ లెన్స్ అవార్డులను వైజాగులోని ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసినట్లు ఆయన అన్నారు.రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెక్టారులో డాక్టర్ ఎస్.కుసుమ చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ఆమెకు అందించినట్లు ఆయన అన్నారు.అవార్డును అందుకున్నట్లు డాక్టర్ కుసుమను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ అభినందనలు తెలియజేశారు.

# ఆంధ్రకేసరి, బ్రహ్మానందరెడ్డిలకు నివాళి



వేంపల్లె మేజర్‌న్యూస్: మాజీ ముఖ్యమంత్రి టంగు టూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతిని, కాసు బ్రహ్మా నందరెడ్డి 30వ వర్ధంతిని సోమవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏపిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధునిగా, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా, సమైక్య మద్రాసు, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు చేశారన్నారు. అలాగే కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్రమంత్రిగా, ముఖ్యమ ంత్రిగా, కేంద్రమంత్రి, గవర్నర్ గా రాష్ట్రానికి, దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. అంతేకాకుండా బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించార న్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, వేమయ్య, వెంకటేష్, నాగరాజు, రాజ, రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల్లో ఆశలు నింపుతున్న వర్షం

## సేద్యాలకు సిద్దమవుతున్న రైతులు



పులివెందుల మేజర్ న్యూస్: గత ఏడాది సకాలంలో వర్షాలు రాక ఖరీఫ్ సాగు చాలా మటుకు తగ్గిపోయింది. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో అక్కడక్కడ చినుకులు పడుతున్నాయి. దీంతో సేద్యాలకు రైతులు కూడా సిద్ధమవు తున్నారు. వేసవి ముగింపు దశకు చేరుకున్న నేథ్యంలో చినుకులు రావడం అన్నదాతలు అదృష్టంగా భావిస్తున్నారు. ఈ సమయంలో వేసవి దుక్కులపై రైతులు దృష్టి సారిస్తారు. ఈ దుక్కులే ఏడాది పొడవునా వివిధ రకాల పంటలకు దోహదపడతాయని రైతులు చెబుతున్నారు.రైతుకు వేసవి దుక్కులు బహుళ ప్రయోజనాలు కలిగిస్తాయి. మార్చి వరకు శ్రమించిన రైతన్నలు తొలకరి చినుకుల కోసం ఎదురు చూడటం పరిపాటి. ప్రస్తుత పరిస్థితులల్లో వేసవి దుక్కులపై అన్నదాతలు సమాలోచనలు జరుపుతున్నారు. ఇప్పటికే వేసవి 35 శాతం కాలం గడిచింది. మరో 65 శాతం గడిస్తే ఊరట కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. సాధారణం గా మేనెలలో అకాల వర్షాలు వస్తే రైతుకు ఊరటనిస్తుంది. బహుశా మే నెల 15వ తేదీ నుంచి రైతుకు కొంత ఉపశమనం లభిస్తుంది. ఇక సాధారణంగా జూన్ మొదటి వారంలో నైరుతీ రుతుపవనాలు రావాల్సి ఉంది. వీటినే తొలకరి లేదా ముంగారి చినుకులు అంటారు. గత కొంత కాలంగా నైరుతీ రుతుపవనాలు గతితప్పాయని రైతులు చెబుతున్నారు. జూన్ మొదటి వారంలో రావాల్సిన రుతుపవనాలు కాస్త అలస్యంగా ప్రవేశిస్తున్నాయి. దీని వల్ల రైతుకు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ లోపు ఏదైనా అకాల కాల వర్షాలు వచ్చి వాతావరణం కాస్త చల్లబడితే రైతులు వేసవి సేద్యాలకు ఉపక్రమించే అవకాశం ఉంది. వేసవి దుక్కులు రైతుకు ఏడాదిపొడవునా సాగు చేసే పంటలకు మిక్కిలి ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు. వేసవిలో సాగించే దుక్కులు లోతుగా దుక్కిదున్నాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీని వల్ల లోపల దాగి ఉంటే క్రిమికీటకాలు ఎండలకు నశించిపోతాయని, తద్వారా కలుపు నివారణ సమస్య తగ్గుతుందని రైతులు వెల్లడించారు. అలాగే భూమిని ఏటవాలుగా దున్నటం వల్ల వర్షాల వల్ల వచ్చే నీరు లోపలికి ఇంకిపోతుంది. దీని ద్వారా వర్షాలు తక్కువైన సమయంలో పైరుకు కాస్త నిలదొక్కుకుంటుందని రైతులు చెప్తున్నారు. ఈ పరిణామ క్రమంలో నైరుతీ రుతుపవనాల వల్ల మెండుగా వర్షాలు వస్తే రైతులు ఏరువాక సేద్యాలు సాగిస్తారు. అనంతరం ఖరీఫ్ దిశగా సాగించే పంటలకు అనుకూలంగా ఉంటుంది. కాగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంనాటికి ముందే ప్రభుత్వం కూడా రాయితీ విత్తనకాయలను అందించాల్సి ఉంది. వీటితో పాటు ఎరువులను కూడా కనీసం 50శాతం రాయితీపై అందిస్తే రైతులు కాస్త ఊపిరిపీల్చుకుంటారు.ఏది ఏమైనా ఈ ఏడాది పంటలు సాగు చేసే రైతుకు ప్రకృతి అన్ని విధాలా కరుణించాలని ఆశిద్దాం.